


నిరీక్షణకు తెర





- ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- షెడ్యూల్ విడుదల చేసిన విద్యాశాఖ

కరీంనగర్ టౌన్, జూన్ 7: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు శుభవార్త చెప్పింది. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపడతామని ప్రకటించిన ప్రభుత్వం శుక్రవారం బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను విడుదల చేసింది. తెలం గాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి పదోన్నతుల కోసం నిరీ క్షిస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్లు, పండిట్‌లు, పీఈటీలకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా నిరుత్సాహన్ని మిగిల్చింది. గత సంవత్సరం గెజిటెడ్ హెడ్మాస్టర్ల పదోన్నతులు, ప్రక్రియ చేపట్టిన ప్రభుత్వం ఎస్జీటీ, ఎల్‌పీ, పీఈటీలకు న్యాయం చేయలేదు. దీంతో కొంత మం ది అర్హత ఉన్నప్పటికీ ప్రస్తుతం ఉన్న హోదాలోనే పదవీ విరమణ చేశారు. స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులు, బదిలీ ప్రక్రియ చేపట్టిన ప్పటికీ వారిని పనిచేస్తున్న చోటి నుంచి రిలీవ్ చేయకపోవడంతో బదిలీలు అయినవారు ఎక్కడికక్కడే విధులు నిర్వహిస్తున్నారు. వీరందరికీ న్యాయం జరిగే విధంగా శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు షెడ్యూల్ విడు దల చేసింది. దీంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- 10, 11 తేదీల్లో దరఖాస్తుల పరిశీలన
- 12,13 తేదీల్లో సీనియార్టీ జాబితా ప్రకటన
- 14,15 తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ, తుదిజాబితా విడుదల
- 16 నుంచి ఎస్జీటీలకు పదోన్నతులు
- 21 నుంచి బదిలీలు

● హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

జిల్లాలో 957 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీ), 170 మంది భాషాపండితులు (ఎల్‌పీ), 62 మంది పీఈటీలు విధులు నిర్వహిస్తుండగా వీరిలో అర్హులైన వారు పదోన్నతులను పొందే అవకాశం లభించింది. బదిలీలకు కూడా అవకాశమివ్వడంతో జిల్లాలో చాలా మంది వారికి అనుకూలమైన పాఠశాలలకు వెళ్ళేందుకు దరఖాస్తు చేసుకునే అవకాశం దక్కింది. జిల్లా స్థాయిలో జరిగే ఈ బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేయడంతో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తంచేస్తున్నాయి. బదిలీలు, పదోన్నతుల కోసం అర్హులైన ఉపాధ్యాయులు ఈనెల 10,11వ తేదీ వరకు జిల్లా విద్యాశాఖ అధికారికి దరఖాస్తు చేసుకున్నవాటిని పరిశీలన చేస్తారు. 12,13 తేదీల్లో ప్రభుత్వ మార్గదర్శకాల ఆధారంగా ఉన్న బదిలీలు, పదోన్నతుల సీనియార్టీ జాబితాను ప్రకటిస్తారు. ఏమైనా అభ్యంతరాలుంటే ఉన్నతాధికారులకు ఆధా రాలతో సహా తెలియపరుచుకునే అవకాశ ముంది. 14,15 తేదీల్లో అభ్యంతరాలను డీఈవోలు పరిశీలించి తుది జాబితాను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. 16 నుంచి 20వ తేదీ వరకు ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్న తులను కల్పించే ప్రక్రియ చేపడతారు. 21 నుంచి 24వ తేదీ వరకు ఎస్జీటీల బదిలీ ప్రక్రియను పూర్తి చేస్తారని చెబుతున్నారు. పదేళ్ల నిరీక్షణ తర్వాత ఎస్జీటీలు, ఎల్‌పీలు, పీఈటీలకు పదోన్నతులు, ఆరేళ్ళ తర్వాత బదిలీ ప్రక్రియ చేపట్టడంతో అర్హులైన వారు సంతోషం వ్యక్తంచేస్తూ పారదర్శ కతతో పదోన్నతులు, బదిలీ ప్రక్రియ చేపట్టాని కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

- బడిబాట పకడ్బందీగా నిర్వహించాలి
- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, జూన్ 7: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో పెద్ద ఎత్తున విద్యార్థులను చేర్పించాలని, బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో బడిబాట కార్యక్రమంపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బడిబాట కార్యక్రమంపై పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ గ్రామాన బడిబాట కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి బడీడు పిల్లలను గుర్తించి వారి వివరాలు సేకరించాలన్నారు. వారు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా కృషి చేయాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న అధికారులు

ప్రైవేట్ పాఠశాలల్లో 1 నుంచి ఐదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతోనూ సమావేశం నిర్వహించా లన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకొని అప్‌గ్రేడ్ అవుతున్న ఐదు నుంచి ఆరు సంవత్సరాల ఉన్న చిన్నారులను అందరిని ప్రభుత్వ పాఠశా లల్లో చేర్పించేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ, విద్యా బోధన, ఆటపాటలు, ప్రత్యేక కార్యక్రమాలు, విహార యాత్రలపై షార్ట్ వీడియోలు రూపొందించాలన్నారు. వాటిని అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు పంపడంతోపాటు వివిధ గ్రూపుల్లో పెద్ద ఎత్తున షేర్ చేయాలని సూచించారు. దీనిపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ షెడ్లు, టాయిలెట్స్ నిర్మాణం పనులు వేగవంతం చేయాలని, ఈజీఎస్ ద్వారా నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. ఈ నెల 10 వ తేదీ వరకు పాఠ్యపుస్తకాలు అందించడంతో పాటు యూనిఫామ్స్ విద్యాశాఖ అధికారులు సిద్ధం చేసి ఉంచాలని సూచిం చారు. విద్యార్థుల హాజరు శాతం తక్కువ ఉన్నచోట పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. జులైలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు షూస్ అందించే ఏర్పాట్లు చేస్తానని వెల్లడించారు. అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రతిభ గల ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను గుర్తించాలని ఆదేశించారు.సమావేశంలో డీఈవో జనార్దన్‌రావు, జడ్పీ సీఈవో శ్రీనివాస్, డీపీవో రవీందర్, డీఆర్డీవో శ్రీధర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, మెప్మా ఇన్‌చార్జి పీడీ స్వరూపారాణి పాల్గొన్నారు.



నేటి నుంచి మృగశిర



కరీంనగర్ కల్చరల్, జూన్ 6: రోహిణిలో రోళ్లు పగిలే ఎండలు గుండెల్లో దడ పుట్టించి తమ ప్రతాపాన్ని చూపి కాస్త తగ్గాయి. మృగశిర కార్తి శనివారం ఉదయం గంటలు 11-44 నిముషాలనుంచి నుంచి ప్రారంభమై 21వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ కార్తి రైతులకు అనుకూలమైంది. ఈ సమయంలో విత్తనాలు విత్తి పొలం పనులు ప్రారంభించుకుంటారు. రూంసా హారులుకార్తి ప్రారంభం రోజు నుంచి ఆరుద్ర ప్రారంభ మయ్యేవరకు వీలునుబట్టి చేపలు తినడం ఆనవాయి తీగా వస్తుంది. అస్తమా రోగులకు ఆయుర్వేద వైద్యులు ఆస్తమా, ఉబ్బసానికి చేపమందు ఇదే కార్తిలో అందిస్తుంటారు.

● ఫిష్ మార్కెట్లు కళకళ

అటు చేపమందు, ఇటు చేపలు తినాలనడంతో నాలుగైదు రోజుల ముందు నుంచే జిల్లా కేంద్రంలోని, నగర శివారులోగల చేపల మార్కెట్లు జనాలతో కళకళలాడుతున్నాయి. మరోవైపు గ్రామాల్లోని చెరువుల్లో చేపలను పట్టి తిరుగుతూ అమ్ముతున్నారు. సాధారణ రోజులకంటే చేపలకు ధరలు పెరిగాయి.



మార్కెట్లో చేపలు కొనుగోలు చేస్తున్న మహిళలు

చురుకుగా మల్టీ పర్పస్ పార్క్ పనులు



- త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు
- ఓపెన్ థియేటర్, మ్యూజికల్ ఫౌంటేన్లు
- ఆధునిక హంగులతో చిల్డ్రన్ ప్లే గ్రౌండ్

కరీంనగర్ టౌన్, జూన్ 7: కరీంనగర్ నడిబొడ్డున ఏడు ఎకరాల విస్తీర్ణంలో చేపడుతున్న మల్టీపర్పస్ పార్కు పనులు చురుకుగా సాగుతున్నాయి. 2020 సంవత్సరంలో పార్కు అభివృద్ధి పనులను ప్రారంభించారు. 2024 మే 15 వరకు పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలంటూ ఆర్‌కేవి బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీతో నగర పాలక సంస్థ ఒప్పందం చేసుకుంది. మొదట్లో కొంత వేగంగానే పనులు జరుగడంతో నిర్ణీత గడువులోగా పార్కును ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రకటించారు. కొద్దిరోజుల తర్వాత వివిధ సాంకేతిక, ఇతర కారణాలతో పనులను మధ్యలోనే నిలిపివేశారు. దీంతో అప్పటికే ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటేన్, టైల్స్ వంటివి దెబ్బతిన్నాయి. పనులను అసంపూర్తిగా వదిలివేయడంతో గతయేడాది పార్కు పనులను పరిశీలించిన మేయర్ యాదగిరి సునీల్‌రావు కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయకుంటే



అగ్రిమెంట్ రద్దు చేస్తామంటూ నోటీసులు జారీ చేశారు. కాంట్రాక్టర్ సమస్యలను కూడా పరిష్కరించి పనులను వేగంగా, నాణ్యత ప్రమాణాలతో పూర్తిచేయాలని ఆదేశించారు. నాలుగైదు నెలలుగా పనుల్లో వేగం పెంచడంతో ప్రస్తుతం 90 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన 10 శాతం పనులను జూలై నెలాఖరులోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జూలై లేదా ఆగస్టులో ప్రజలకు ఈ పార్కును అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు.



● ఏడెకరాల విస్తీర్ణంలో..

ఏడెకరాల స్థల విస్తీర్ణంలో గల ఈ పార్కులో ఆహ్లాదకరంగా ఉండే చెట్లు, ల్యాండ్ స్కేప్ వర్క్, విద్యుద్దీకరణ పనులు, డ్రిప్, స్ప్రింక్లర్ల పనులు, మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు విగ్రహావిష్కరణకు బ్లాక్ నిర్మాణ పనులు, ఇతర పనులు దాదాపు పూర్తయ్యాయి. వీటితోపాటు ఈపీడీఎం ఫ్లోరింగ్‌తో కూడిన వాకింగ్ ట్రాక్, ఈపీడీఎం ఫ్లోరింగ్ చిల్డ్రన్ ప్లే ఏరియా పనులు చివరి దశకు చేరుకున్నాయి. సీటింగ్, వాకింగ్ బారెల్, రోటో క్రాల్ ట్యూబ్, స్లైడ్ రోటో వేవ్, కేమల్ స్ప్రింగ్ రైడర్ వంటివి ఏర్పాటు చేశారు. మ్యూజికల్ వాటర్ ఫౌంటేన్ పనులు ఇంకా ప్రారంభించలేదు.

నగర వాసులకు ఆహ్లాదం పంచేలా పార్కు అభివృద్ధి

- మేయర్ యాదగిరి సునీల్‌రావు

నగరవాసులకు ఆహ్లాదాన్ని కలిగించే విధంగా మల్టీపర్పస్ పార్కును తీర్చిదిద్దుతున్నాం. ఎన్నికల కోడ్, ఇతరత్రా కారణాలతో పనుల్లో జాప్యం జరిగింది. పనులు 90 శాతం మేరకు పూర్తయ్యాయి, మ్యూజికల్ ఫౌంటేన్, మల్టీపర్పస్ భవనాన్ని చారిత్రక కట్టడంగా మార్చడం, కేఫటేరియా, ఇతర పనులు మిగిలిపోయాయి. జూలై నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాం. ఆగస్టు మాసంలో పార్కును ప్రజలకు అందుబాటులోకి తెస్తాం.



గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు ఏర్పాట్లు చేయాలి

- టీజీపీఎస్సీ నిబంధనలపై అభ్యర్థులకు అవగాహన ఉండాలి..
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, గ్రూప్-1 ప్రిలిమ్స్ నోడల్ ఆఫీసర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ , జూన్ 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు శనివారంలోగా అన్ని ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, గ్రూప్-1 నోడల్ ఆఫీసర్ ప్రఫుల్‌దేశాయ్ ఆదేశించారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాల రూట్ ఆఫీసర్లు, డిపార్ట్మెంట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ మాట్లాడుతూ టీజీపీఎస్సీ రూపొందించిన నిబంధనలపై అధికారులు, అభ్యర్థులకు అవగాహన ఉండాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు వాటి పనితీరు, తాగునీరు, టాయిలెట్స్ ఇతర వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. సీటింగ్ ఏర్పాట్లు పక్కగా చేయాలని, అభ్యర్థులు ఇబ్బందులు పడకుండా చూడాలని తెలిపారు. కరీంనగర్‌లో 36 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 18,663 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తున్నారన్నారు. అభ్యర్థులు మూడోసారి ప్రిలిమ్స్ పరీక్షకు హాజరవు తున్నారని, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు జరగవద్దని, అన్ని ముం దు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రం వద్ద ఒక్క గేటును మాత్రమే ఉంచాలని సూచించారు. ఈ నెల 9న ఆదివారం ఉదయం 9 గంటల వరకే అభ్యర్థులంతా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. 9:30 గంటల నుంచి బయోమెట్రిక్ విధానం ద్వారా హాజరు తీసుకుంటారని తెలిపారు. 10 గంటలకు ఆయా పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేస్తారని, ఆ తర్వాత వచ్చే అభ్యర్థులకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ఉదయం 10:30 నుంచి 1గంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. పరీక్ష జరుగుతున్న సమయంలో అరగంటకు ఒకసారి బెల్ మోగిస్తారని చెప్పారు. అభ్యర్థుందరికీ బెల్ వినిపించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సెల్‌ఫోన్లతోపాటు ఎలక్ట్రానిక్ వస్తువులకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి లేదని, ఎవరైనా తీసుకెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్య క్రమంలో డీఆర్వో పవన్ కుమార్, ఆర్డీవో కె మహేశ్వర్, అడిషనల్ డీసీపీ జె కుమార్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ శ్రీలక్ష్మి, కొండగట్టు జేఎన్టీయూ ప్రొఫెసర్ బి సతీష్ కుమార్, కలెక్టరేట్ సూపరిండెంట్ కాళీచరణ్ పాల్గొన్నారు.

పోలీసుల బదిలీలకు రంగం సిద్ధం

● ఎస్ఐ నుంచి ఏసీపీ వరకు పోస్టుల కోసం పైరవీలు..?

కరీంనగర్ క్రైం, జూన్ 7: కమిషనరేట్ వ్యాప్తంగా ఎస్ఐ, సీఐ, ఏసీపీల బదిలీలకు రంగం సిద్ధమవుతున్నది. 2023లో అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కమిషనరేట్ వ్యాప్తంగా ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఎస్ఐ, సీఐ, ఏసీపీల బదిలీలు భారీగా జరిగాయి. ఆ బదిలీల్లో స్థానిక ప్రజాప్రతినిధులు వారికి నచ్చిన, అనుకూలంగా మెదిలే అధికారులు పైరవీలతో పోస్టింగ్‌లు ఇప్పించుకున్నారు. ఇలాంటి పోస్టింగ్‌లలో భారీగా డబ్బులు చేతులు మారాయని అప్పట్లో పెద్ద ఎత్తున విమ ర్శలు వచ్చాయి. ఆ విధంగా పోస్టింగ్‌లు పొందిన పోలీసు అధికారులు కొందరు ఎన్నికల సమయంలో ఆ ఆమాత్యులకు అనుకూలంగా పనిచేసినట్లు ఎన్నికల సమయంలో ఆరోపణలు వెల్లువెత్తాయి. అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఇందులో కొందరు అధికారులపై కొత్త ప్రభుత్వం వచ్చిన అనంతరం వేటుపడింది.



● రెండేళ్ల గడువు ముగిసిన వారికి..

కరీంనగర్ పోలీస్‌కమిషనరేట్ పరిధిలో ప్రస్తుతం రెండేళ్ళ గడువు ముగిసిన మానకొండూర్, హుజూరాబాద్, జమ్మికుంట రూరల్ ఎస్‌హెచ్‌ఓలతో పాటు పలువును సీఐ, ఏసీపీల బదిలీలు జరుగ నున్నట్లు ప్రచారం జరుగుతున్నది. కరీంనగర్ అడిషనల్ డీసీపీ, టాస్క్ ఫోర్స్ ఏసీపీ, కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ పోస్టులు ప్రస్తుతం ఖాళీగా ఉన్నారు. ఈ పోస్టులను భర్తీ చేయడంతోపాటు పలువురు పోలీసు అధికారులు బదిలీలు జరుగనున్నట్లు తెలుస్తోంది. కమిషనరేట్‌లో 18 స్టేషన్లుండగా, ఇందులో 12 స్టేషన్లకు ఎస్ఐలు స్టేషన్ హౌజ్ ఆఫీస ర్లుగా, మరో 6 ఠాణాలకు సీఐలు స్టేషన్ హౌస్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తున్నారు. కమిషనరేట్‌లో కరీంనగర్ టౌన్, కరీంనగర్ రూ రల్, హుజూరాబాద్ పోలీస్ సబ్ డివిజన్లు ఉన్నాయి. వీటికితోడుగా కరీంనగర్ ట్రాఫిక్, సీసీఎస్, స్పెషల్‌బ్రాంచి, సీసీఆర్‌బీ, ఫంక్షనల్ వర్టికల్ విభాగానికి ఏసీపీలు అధికారులుగా ఉన్నారు. కమిషన రేట్‌లోని చాలా మంది సీఐ, ఏసీపీల సర్వీసు కాలం రెండేళ్లు పూర్తి కాలేదు. అయినా కొత్త ప్రభుత్వం పెద్ద ఎత్తున బదిలీలు చేసే అవకా శాలున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్నది.

● సమర్థతకు ప్రాధాన్యం దక్కేనా?

ప్రభుత్వాలు మారినా సమర్థతకు ప్రాధాన్యం లేకుండా పోతున్నదని పోలీసుశాఖలోని కొందరు సీనియర్ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా ప్రాధాన్యం కలిగిన పోస్టింగ్ లభిస్తుందని ఆశిస్తున్న అధికారులకు మళ్ళీ నిరాశే ఎదురవుతున్నదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. గత ప్రభుత్వ హయాంలో పైరవీలు లేకుంటే లూప్‌లైన్ పోస్టులకే పరిమితం అయిన పలువురు పోలీసు అధికారులు కొత్త ప్రభుత్వంలోనైనా తమకు ప్రాధాన్యం దక్కుతుందనే ఆశతో ఉన్నారు.

● సీపీని బదిలీ చేయొద్దు..

- భూబాధితుల సంఘం నాయకులు

కరీంనగర్‌లో చాలా కాలంగా భూకబ్జాలు, దౌర్జన్యాలు, మోసాలు, బెదిరింపులకు పాల్పడుతున్న అక్రమార్కుల భరతం పడుతూ బాధితులకు న్యాయం చేస్తున్న సీపీని అభిషేక్ మొహంతిని ప్రభుత్వం బదిలీ చేయవద్దని, ఇక్కడే రెండేళ్లపాటు కొనసాగించాలని భూబాధితుల సంఘం నాయకులు కొత్త రాజిరెడ్డి ప్రభుత్వానికి, డీజీపీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ సామాన్యులకు న్యాయం చేస్తున్న సీపీని కొనసాగించి బాధితులకు న్యాయం చేయాలని సీఎం, డీజీపీలకు వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సాధారణ బదిలీల్లో భాగంగా కరీంనగర్ సీపీని కూడా బదిలీ చేసే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతుండడంతో తాము డీజీపీ, సీఎంలకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- ఏడీఏ సునీత

హుజూరాబాద్‌రూరల్, జూన్ 7: హుజూరాబాద్ ప్రాంతంలో నకిలీ విత్తనాలు ఎవరైనా విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని, వారిపై చర్యలు తీసుకుంటామని ఏడీఏ సునీత అన్నారు. అనుమతులు ఒక్క చోట తీసుకొని విత్తనాలను మరో చోట విక్రయిస్తున్న కంపెనీ ప్రతినిధిపై 6ఏ కింద శుక్రవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు, వ్యవసాయాధికారులు తెలిపారు. మేడ్చల్ జిల్లాకు చెందిన శాంభవి ఆగ్రి సీడ్స్ ప్రతినిధి రాచపల్లి లింగయ్య మండలంలోని శాలపల్లి -ఇందిరానగర్ గ్రామంలోని రైతులకు 20 కిలోల విత్తనాల బ్యాగుల చొప్పున 141 బస్తాలు సుమారు 60 క్వింటాళ్ల విత్తనాలను విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారన్న సమాచారం మేరకు వ్యవసాయ శాఖ, పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. అనుమతి ఒక చోట ఉంటే విత్తనాల విక్రయాలు మరోచోట జరిపినందుకు గాను సదరు కంపెనీ ప్రతినిధిపై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు ఏడీఏ సునీత, ఏవో సునీల్‌కుమార్, టౌన్ సీఐ బొల్లం రమేశ్ తెలిపారు.

10 నుంచి టీజీ పీఈసెట్

గణేశ్‌నగర్, జూన్ 7: తెలంగాణా ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్-2024 (టీజీ పీఈసెట్)ను ఈ సంవత్సరం కూడా శాతవాహన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించ బడుతుందని కన్వీనర్ ఆచార్య రాజేష్ కుమార్ తెలిపారు. 2400 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరికి జూన్10 నుంచి 13వరకు శాతవాహన విశ్వ విద్యాలయం లోని క్రీడా మైదానంలో శరీర దారుఢ్య సామర్థ్య పరీక్షలు, క్రీడా నైపుణ్య పరీక్షలు నిర్వహించమన్నట్లు తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 6:30 నుంచి బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హత పరీక్షలు నిర్వహిస్తామన్నారు. హాల్ టికెట్లను వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పురుష అభ్యర్థులకు ఈనెల 10,11వ తేదీల్లో, మహిళా అభ్యర్థులకు 12,13వ తేదీల్లో శారీరక సామర్థ్య పరీక్షలు, క్రీడా నైపుణ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షలకు హాజరయ్యే దూర ప్రాంత విద్యార్థులకు యూనివర్సిటీలో వసతి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

ఎస్‌యూ బీఎస్సీ హానర్స్ పరీక్షల షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, జూన్ 7: శాతవాహన విశ్వవిద్యాలయం బీఎస్సీ హానర్స్ రెండవ సెమిస్టర్‌కు సంబంధించిన తేదీలను యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ శ్రీరంగప్రసాద్ శుక్రవారం విడుదల చేశారు. ఈనెల 19 నుంచి 26 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

రేషన్ సరుకుల కోసం

ఇబ్బందులు

- కిలోమీటర్ల దూరం వెళ్తున్న ప్రజలు

- తుర్తిలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని వేడుకోలు



తుర్తి గ్రామం

కథలాపూర్, జూన్ 7: రేషన్ సరుకులు మా పల్లెలోనే పంపిణీ చేయండి మహాప్రభో అని మొరపెట్టుకుంటే... లేదండీ మీకు నిబంధనలు వర్తించవు అనే అధికారుల సమాధానాలతో ఆ పల్లె జనం ఎదుర్కొంటున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. ఏళ్ల తరబడి రేషన్ దుకాణాలు లేక కిలోమీటర్ల కొద్దీ దూరం నడిచి సరుకులు తెచ్చుకుంటున్నామని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా తమ ఇబ్బందులను పట్టించుకునే నాథుడే లేడని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

● హామీలు నెరవేర్చని నేతలు

మూడు మండలాల సరిహద్దుల్లో ఉన్న తుర్తి గ్రామంలో నేటికీ రేషన్ దుకాణం ఏర్పాటు చేయని కారణంగా నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న అంబారిపేటకు వెళ్లి సరుకులు తెచ్చుకుంటున్నారు. ఇక్కడికి కేటాయించిన సరుకులను అంబారిపేటకు చెందిన డీలర్‌తో పంపిణీ చేస్తున్నారు. అధునాతన పద్ధతిలో ఆన్‌లైన్ ద్వారా సరుకులు పంపిణీ చేస్తుండగా ఈ పల్లెలో టెలికాం నెట్‌వర్క్ సమస్య కారణంగా విధిలేని పరిస్థితుల్లో వినియోగదారులు అంబారి పేటకు వెళ్లాల్సి వస్తోంది. అదేవిధంగా అంబారిపేట పరిధిలో ఉన్న గిరిజనులు రెండు కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి సరుకులు తీసుకెళ్తున్నారు. వానాకాలంలో వినియోగదారులకు విపరీతమైన ఇక్కట్లు తప్పడం లేదు. ఆరు సంవత్సరాల కిందట చింతకుంటకు అనుబంధంగా ఉన్న రాజారాం తండా గ్రామ పంచాయతీగా ఏర్పడింది. ఇక్కడ కూడా నేటికీ రేషన్ దుకాణం మంజూరు చేయలేదు. దీంతో నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతకుంటకు విధిలేక సరుకుల కోసం వెళ్లక తప్పడం లేదని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 500 రేషన్ కార్డులు ఉంటేనే రేషన్ దుకాణం ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇస్తుందనే నిబంధనలు ఆ పల్లెవాసులకు గుదిబండగా మారిందనే ఆవేదన వెలిబుచ్చుతున్నారు.



ఎన్నోసార్లు విన్నవించినా ఫలితం లేదు

గ్రామపంచాయతీ ఏర్పడ్డ నాటి నుంచి రేషన్ దుకాణం మంజూరు చేయాలని అనేక సార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించాం. గిరిజనులు సరుకుల కోసం పడుతున్న అవస్థలను వివరించి చెప్పినా వినిపించుకోలేదు. మారుమూల అటవీ ప్రాంతాల ప్రజల ఇబ్బందులను పట్టించుకోకపోవడం దారుణం.

- లావుడ్య రవీందర్, రాజారాం తండా



దుకాణాలు ఏర్పాటు చేయాలి

ప్రజల కష్టాలను దృష్టిలో ఉంచుకుని దుకాణాలు ఏర్పాటు చేయాలి. మండల పరిషత్ సమావేశాల్లో పలు మార్లు ఈ సమస్యను ప్రస్తావించి అధికారుల దృష్టికి తెచ్చిన సందర్భాలున్నాయి. జనాభా, కార్డులతో సంబంధం లేకుండా గ్రామపంచా యతీకి రేషన్ దుకాణం విధిగా మంజూరు చేస్తూ కొత్త ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.

- కోలకాని శేఖర్, మాజీ సర్పంచ్ తుర్తి

అటవీ భూముల ఆక్రమణ .. ఒకరిపై కేసు నమోదు



అటవీ ప్రాంతంలో నరికిన చెట్లు

కోనరావుపేట, జూన్ 7: అటవీ భూములను ఆక్రమించేందుకు టేకు చెట్లతో సహా అన్నిటినీ నరికి వేస్తున్నారు. రెండు రోజుల క్రితం అధికారులు ఒకరిపై కేసు నమోదు చేశారు. కోనరావుపేట మండల కేంద్రంలోని అటవీ ప్రాంతంలో అక్రమార్కులు అటవీ సంపదను కొల్లగొడుతున్నారు. భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. కోనరావుపేట అటవీ ప్రాంతంలోని ఎగ్లాస్‌పూర్ ఎల్లమ్మ టెంపుల్ ఆవరణలోని అటవీ ప్రాంతంలో ఏకంగా మిషన్ల ద్వారా చెట్లను నరికి వేస్తున్నారు. అటవీ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. వారం రోజులుగా మిషన్‌లతో చెట్లను నరికి వేస్తూ ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. చక్రాల వేణు అనే వ్యక్తిపై ఇప్పటికే అటవీ అధికారులు కేసు నమోదు చేశారు. అయినప్పటికీ చెట్లను నరికి వేస్తూ అటవీ సంపదను కొల్లగొడుతున్నారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. చెట్లను నరికి వేస్తూ అటవీ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోనరావుపేట మండల వాసులు కోరుతున్నారు. అటవీ భూముల ఆక్రమణపై ఎఫ్ఎస్‌వో శ్రీనివాస్‌ను వివరణ కోరగా చెట్లను నరికి వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే చక్రాల వేణుపై కేసు నమోదు చేశామన్నారు. మిషన్‌లతో చెట్లు నరికిన ప్రాంతాన్ని పరిశీలించామన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రెండు గ్రామాల మత్స్యకారుల మధ్య చేపల చెరువు వివాదం

చందుర్తి, జూన్ 7 : చేపల కోసం రెండు గ్రామాల మధ్య పంచాయతీ ఏర్పడింది. చందుర్తి మండలంలోని కట్టలింగంపేట, లింగంపేట గ్రామాల శివారులో గురునాథం చెరువు ఉంది. గతంలో కట్టలింగంపేటకు చెందిన గంగపుత్ర సంఘం మత్స్యకార్మికులు సొసైటీ ఏర్పాటు చేసుకొని మత్స్యకారులు కలిసి చేపలు పట్టుకునే వారు. వాటా(పాలు) పంచుకునేవారు. శుక్రవారం మృగశిర కార్తె ప్రారంభం కావడంతో కట్టలింగంపేటకు చెందిన మత్స్యకారులు గురునాథం చెరువులో చేపలు పట్టుకొని వచ్చారు. లింగంపేటకు చెందిన మత్స్యకారులు వెళ్లడంతో విషయం తెలుసుకున్న కట్టలింగంపేట గ్రామానికి చెందిన మత్స్యకారులు చెరువు వద్దకు వెళ్లి తమ చెరువులో చేపలు పట్టవద్దంటూ అడ్డుకున్నారు. దీంతో రెండు గ్రామాలకు చెందిన మత్స్యకారులు చెరువు మాదంటే, మాదే అనడంతో వివాదం తలెత్తింది. ఏడాది క్రితం కూడా వివాదం తలెత్తింది. గతంలో చెరువు సొసైటీ ఏర్పాటు చేసుకొని ఎవరైతే పట్టుకున్నారో వారే పట్టుకోవడానికి హక్కులు ఉంటాయని ఎస్సై శ్రీకాంత్ సూచించారు. లింగంపేటకు చెందిన మత్స్యకారులు చెరువులో తమ పట్టా భూములు ఉన్నాయని చెప్పడంతో, సమస్యను కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.

ఇస్రో ఆన్‌లైన్ శిక్షణకు ఉపాధ్యాయుడి ఎంపిక


షరీఫ్ అహ్మద్

చిగురుమామిడి, జూన్ 7: మండలంలోని రామంచ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు షరీఫ్ అహ్మద్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ (ఐఐఆర్ఎస్), ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో) ఆధ్వర్యంలో నిర్వహించే ఆన్‌లైన్ శిక్షణకు ఎంపికయ్యా రని ప్రధానోపాధ్యా యుడు ఎస్ దామోదర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 10 నుంచి 14వ తేదీ వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో నిర్వ హించే శిక్షణ కార్యక్రమానికి షరీఫ్ అహ్మద్ ఎంపిక కావడం సంతోకరమని పేర్కొన్నారు. దీని ద్వారా జాతీయ స్థాయిలో పాఠశాలకు గుర్తింపు రావడం సంతోషకరమని తెలిపారు.

గత ప్రభుత్వ పెద్దల నిర్లక్ష్యంతోనే
కాళేశ్వరం ప్రాజెక్టుకు భారీ నష్టం

- ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకే మూడు బ్యారేజీల మరమ్మతులు
- పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలి
- బ్యారేజీల నష్టంపై జ్యుడీషియల్ కమిటీ విచారణ
- తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీని తప్పకుండా నిర్మిస్తాం
- రాష్ట్ర నీటి పారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మంథని/మంథనిరూరల్, జూన్ 7: గత ప్రభుత్వంలో పెద్దల నిర్లక్ష్యం తోనే కాళేశ్వరం ప్రాజెక్టు భారీ నష్టం జరిగిందని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. మంథని మండలంలోని సుందిళ్ల బ్యారేజీలో కొనసాగుతున్న మరమ్మతు పనులను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ) సూచనల ప్రకారమే కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని సుందిళ్ళ, మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల పునరుద్ధరణ చర్యలను ఏజెన్సీల ద్వారా నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. యుద్ధ ప్రాతిపదికన బ్యారేజీల్లో కొనసాగుతున్న రిపేర్ పనుల్లో ప్రతి పనికి నిర్దిష్ట సమయం నిర్దేశించుకుని వేగవంతంగా పూర్తి చేయాలి అధికారులకు సూచించారు. సుందిళ్ళ బ్యారేజీ వల్ల స్థానికంగా వచ్చే సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అందించిన సూచనల ప్రకారం మరమ్మతు, పునరుద్ధరణ పనులు వేగవంతంగా పూర్తికావాలన్నారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిలో ఆశించిన మేర ఫలితం కనపడటం లేదని, అవసరమైన మేర అదనపు బృందాలను ఏర్పాటు చేసి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతి పనికి సమయాన్ని నిర్దేశించుకొని దానిలోపు ఆ పని పూర్తిచేసే విధంగా ఏజెన్సీలు పనిచేయాలని, ఏ పని ఎప్పటి వరకు పూర్తవుతుందో కాగితంపై షెడ్యూల్ రూపొందించి అందించాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయినప్పటికీ నిర్లక్ష్యం వహిస్తూ ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 3 బ్యారేజీల పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలను సూచించాలని, దేశంలోనే పార్లమెంట్ ద్వారా ఏర్పాటు చేసిన అత్యున్నత సంస్థ అయిన జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి బాధ్యత అప్పగించడం జరిగిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలను పరిశీలించేందుకు తమ ప్రభుత్వం సుప్రీంకోర్టు మాజీ జడ్జీ చంద్ర ఘోష్ ఆధ్వర్యంలో వేసిన జ్యుడీషియల్ కమిషన్ సైతం ప్రాజెక్టును సందర్శిస్తుం దన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం మేరకు తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీని తప్పనిసరిగా నిర్మిస్తామన్నారు. ఈఎన్‌సీ జనరల్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. సుందిళ్ల(పార్వతి) బ్యారేజ్ వద్ద కొట్టుకుపోయిన ఇసుక పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని, జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల ప్రకారం జియో ఫిజికల్, జియో టెక్నికల్ జనరల్ పరీక్షలు నిర్వహించి కొట్టుకుపోయిన ఇసుకను అంచనా వేసి వాటిని పునరుద్ధరించి బ్యారేజీ సంరక్షణ చర్యలు చేపడుతున్నామన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు పనులను క్షేత్రస్థాయిలో వేగవంతం చేసి రాబోయే పది రోజుల్లో పునరుద్ధరణ పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ, ఎస్ఈఎం. కరుణాకర్, ఈఈ సర్దార్ ఓంకార్ సింగ్, ఇతర నీటి పారుదల అధికారులు, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్‌పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, శశిభూషణ్‌కాచే, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

చంద్రఘోష్‌ను కలిసిన అదనపు కలెక్టర్

జ్యోతినగర్, జూన్ 7: కాళేశ్వరం ఎత్తిపోతల పథకం విచారణ కమిషన్ చైర్మన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి పి చంద్రఘోష్‌ను శుక్రవారం ఎన్టీపీసీ పీటీఎస్‌లోని వీజీపీ గెస్ట్‌హౌస్(జ్యోతిభవన్)లో అ దనపు కలెక్టర్ జె అరుణశ్రీ కలిశారు. విచారణలో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పరిశీలించిన తరువాత ఎన్టీపీసీకి వచ్చిన కమిషన్ చైర్మన్‌కు అదనపు కలెక్టర్ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.


చంద్రఘోష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అదనపు కలెక్టర్

హత్యా..ఆత్మహత్యా?

- అనుమానాస్పదంగా మృతి చెందిన జూనియర్ అసిస్టెంట్ - శరీరంపై గాయాలు
- సీసీ ఫుటేజీ పరిశీలించిన పోలీసులు - జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో విషాదం


రమేశ్(ఫైల్)


వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జూన్ 7: భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో విషాదం చోటుచేసుకుంది. కాలనీలో నివాసముంటూ జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుళ్లకోట గ్రామానికి చెందిన పంగ రమేశ్(50) అనే వ్యక్తి పట్టణంలోని రాంనగర్‌కాలనీ భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసముంటున్నాడు. గతంలో వీఆర్ఏ, వీఆర్‌వోగా పనిచేసిన ఆయన వీఆర్‌వో వ్యవస్థను గత ప్రభుత్వం రద్దు చేయడంతో ప్రస్తుతం భూపాలపల్లి మునిసిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. భార్య రేణుక పిల్లలను తీసుకొని రెండు రోజుల కిందటే కరీంనగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లగా రమేశ్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. శుక్రవారం తెల్లవారుజామున ఇంటి తలుపులు తీసి ఉండటం, కోతులు ఇంట్లోకి చొరబడి చిందరవందర చేశాయి. దీంతో గమనించిన ఇంటి పక్కనున్న వారు కోతులను కొట్టేందుకు ఇంట్లో వెళ్లి చూడగా రమేశ్ విగత జీవిగా బాత్ రూమ్‌లో పడి ఉన్నాడు. పోలీసులకు సమాచారం అందించారు. భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, భూపాలపల్లి ఇన్‌చార్జ్ సీఐగా ఉన్న చిట్యాల సీఐ మల్లేష్‌యాదవ్, ఎస్సై ప్రసాద్ లు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. చుట్టుపక్కల వారి ని ఆరా తీశారు. కాగా, మృతుడి శరీరంపై గాయాలు ఉన్నాయి.

● అదుపులో ఇద్దరు వ్యక్తులు..?

ఈ ఘటన వివరాలు తెలియగానే సకాలంలో చేరుకున్న పోలీసులు రమేష్ మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. విచారణను వేగవంతం చేసి మృతుడి ఇంటి ఎదుట ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి అందులోని హార్డ్‌డిస్క్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో వారి కుటుంబ సభ్యుల్లోని ఓ ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. కుటుంబ అవసరాలకు పంగ రమేశ్ వారి బంధువుల వద్ద తీసుకున్న డబ్బుల విషయంలోనే గొడవలు జరిగి ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటారనే చర్చ జరుగుతోంది. కాగా, పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారిస్తుండటం ఇందుకు బలాన్ని చేకూరుస్తోంది.

విచారణ తదుపరి వివరాలు వెల్లడిస్తాం..

- మల్లేష్‌యాదవ్, భూపాలపల్లి ఇన్‌చార్జి సీఐ

భూపాలపల్లి రాంనగర్‌లో జరిగిన ఘటనపై మృతుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం. పూర్తి స్థాయిలో విచారణ చేసిన పిదప వివరాలు వెల్లడిస్తాం. శరీరంపై గాయాలు ఉండటం మూలంగా హత్య చేసినట్లుగానే అనుమానిస్తున్నాం. త్వరలోనే నిజాలు తేల్చి హత్యా.. ఆత్మహత్యా.. సాధారణ మరణమనేది చెబుతాం.

అగ్ని పర్వతంపై కరీంనగర్ మహిళ

కరీంనగర్ అర్బన్, జూన్ 7: అగ్ని పర్వతంపై మొదటిసారిగా భారతదేశానికి చెందిన ఇద్దరు మహిళలు అడుగుపెట్టి చరిత్ర సృష్టించారు. ఆ ఇద్దరిలో ఒకరు మహమ్మద్ పర్వీన్ సుల్తానా కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందినవారు. ఆసియా ఖండంలో ఏకైక అగ్ని పర్వతం అండమాన్ నికోబార్ దీవులలో బెరన్ ఐలాండ్‌లో ఉంది. ఆ అగ్ని పర్వతంపై మొదటిసారిగా ఇద్దరు మహిళలు అడుగుపెట్టారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సెస్, డెహ్రాడూన్, ఇస్రో వారి ప్రత్యేక పరిశోధన ప్రాజెక్టులో భాగంగా డాక్టర్ మమతా చౌహాన్ సారథ్యంలో పరిశోధకుల బృందం అగ్ని పర్వతవం వద్దకు వెళ్లారు. ఆ బృందంలో ఒక రు రీంనగర్ కోతిరాం పూర్‌కు చెందిన మహమ్మద్ పర్వీన్ సుల్తానా. మే 29న బెరెన్ ఐలాండ్‌లోని అగ్ని పర్వతంపై ఆమె అడుగు పెట్టారు. ఈ పరిశోధనలో భాగంగా అగ్ని పర్వతం భౌగోళిక పరిణామాలు, శాస్త్రీయ విశ్లేషణ, అగ్ని పర్వత పనితీరు, ప్రకృతి విపత్కర పరిస్థితులపై అంచనా కోసం అక్కడ నుంచి వివిధ రకాల నమూనాలను సేకరించారు. అండమాన్ ఐలాండ్‌లోని డిగ్లీపూర్ నుంచి రంగౌత్ వరకు సుమారు వంద కిలోమీటర్లకు పైగా వివిధ ప్రాంతాలలో నమూనాలను సేకరించారు.


పర్వీన్ సుల్తాన

వివాహిత ఆత్మహత్యాయత్నం

మల్యాల, జూన్ 7: జగిత్యాలకు చెందిన ఓ వివాహిత బావిలో దూకి ఆత్మహత్య యత్నం చేసుకుంది. రజిత అనే ఆశవర్కర్ శుక్రవారం ఉదయం మల్యాల మండలం నూకపల్లి శివారులో గల బావిలో దూకగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బ్లూకోల్ట్స్ సిబ్బంది సంపత్ తదితరులు అక్కడకు చేరుకొని స్థానికులతో కలసి ఆమెను బావిలో నుంచి తీశారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులు రజితను ఆసుపత్రికి తీసుకెళ్లగా ప్రమాదం ఏమీ లేదని తెలిసింది. ఆత్మహత్యయత్నంకు కారణాలు తెలియలేదు. ఫిర్యాదు రాలేవదని ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు.

రైతుకు తీవ్ర గాయాలు

సైదాపూర్, జూన్ 7: సైదాపూర్ మండల కేంద్రానికి చెందిన దాసరి గోపాల్ అనే రైతు తన వ్యవసాయ భూమిలో టాక్టర్ రోడ్డువేటర్‌తో భూమి చదును చేయిస్తుండగా ప్రమాదవశాత్తు రోడ్డు వేటర్ మధ్య కాలు పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తన వ్యవసాయ భూమిలో రోడ్డు వేటర్‌తో భూమి దున్నుతుంటే గోపాల్ వెనుక నుంచి ట్రాక్టర్ ఎక్కబోయి ప్రమాదవశాత్తు జారాడు. కాలు రోడ్డు వేటర్లో పడడంతో తెగిపోయింది. గోపాల్‌ను కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు.

రేషన్ బియ్యం పట్టివేత

చందుర్తి, జూన్ 7 : చందుర్తి మండలం లింగంపేటలో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. లింగంపేట గ్రామంలో బోజ సుభాష్ అక్రమంగా రేషన్ బియ్యం ఓ ఇంట్లో నిల్వ చేశాడు. సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు చేశారు. ఇంట్లోని ఓ గదిలో 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వ చేసి ఉండగా సీజ్ చేశారు. ఈ ఘటనలో సుభాష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న బియ్యాన్ని అక్రమంగా తరలించడం నేరమని తెలిపారు.

డీఈఈ సెట్-2024 నోటిఫికేషన్ విడుదల

తిమ్మాపూర్, జూన్ 7: ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్)లలో, ప్రైవేటు కళాశా లల్లో రెండు సంవత్సరాల కోర్సులైనా డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్ఈ) మొదటి సంవత్సరము 2004-25లో చేరేందుకు నిర్వహించే డీఈఈ సెట్-2024 నోటిఫికేషన్ విడుదలైందని ఎల్ఎండీ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో చేరేందుకు ఇంటర్‌లో అభ్యర్థులు కనీసం 50శాతం మార్కులు కలిగి ఉండాలని పేర్కొన్నారు. షెడ్యూల్ తెగల, షెడ్యూల్ కులాలు, దివ్యాంగ అభ్యర్థులు కనీసం 45శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు సెప్టెంబరు 1,2024 నాటికి 17 సంవత్సరాల వయస్సు ఉండాలని గరిష్ట వయో పరిమితి లేదని పేర్కొన్నారు. ఈనెల 30వ తేదీ లోగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష జూలై 10వ తేదీన ఉంటుందని తెలిపారు. డీఈఎల్ ఈడీ కోర్సు తెలుగు, ఉర్దూ, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుందని పేర్కొన్నారు. డీపీఎస్ఈ మాత్రము కేవలం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుందని తెలిపారు. వివరాలకు డీఈఈసెట్-2024 వెబ్‌సైట్ పరిశీలించాలని సూచించారు.

ప్రశాంత్‌రెడ్డి హత్య కేసులో మరో ఇద్దరి అరెస్టు

మానకొండూర్, జూన్ 7: మండలంలోని పచ్చునూర్ గ్రామానికి చెందిన రౌడీ షీటర్ గోపు ప్రశాంత్‌రెడ్డి హత్య కేసులో మరో ఇద్దరిని శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. పచ్చునూర్‌లో భూ వివాదంలో రమేష్, ప్రశాంత్‌రెడ్డి ఇద్దరు రౌడీషీటర్ల మధ్య గొడవలు ముదిరి మే 28న హత్యకు తీశాయని తెలిపారు. హత్య జరిగిన అనంతరం 11 మంది పరారు కాగా ఇందులో ప్రధాన నిందితుడితో పాటు మరో 8మందిని ఈ నెల 4న పోలీసులు అరెస్టు చేశారు. కాగా. మరో ఇద్దరు గాజు శంకర్, మద్దెల వెంకటేశ్‌లు తప్పించుకోగా శుక్రవారం మండల కేంద్రంలో వారిని అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు.

రూ. 1.40 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

సైదాపూర్, జూన్ 7: సైదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న చట్ల అంజనేయులు అనే కానిస్టేబుల్ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కాడు. తన ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.1.40లక్షలు డ్రా చేసుకున్నారని బాదితుడు అంజనేయులు గురువారం హైదరాబాద్ సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. సైబర్ నేరగాళ్లు గత నెల 30న అంజనేయులు సెల్‌కు కాల్ చేశారు. ఆ కాల్ లిఫ్ట్ చేసినంతలో అంజనేయులు సెల్‌కు ఓటీపీ వచ్చింది. కొంత సేపటికి ఆంజనేయులు సెల్ బ్లాక్ అయింది. కొత్త సిమ్ తీసుకునేంతలోపు అంజనేయులు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.1.40లక్షలు డ్రా చేసుకున్నారు. తన సిమ్ ఆక్టివేట్ అవగానే ఖాతా నుంచి డబ్బులు డ్రా అయినట్లు అంజనేయులుకు మెస్సేజ్‌లు వచ్చాయి. ఖాతాలో ఉన్న రూ.1.93లక్షల నుంచి సైబర్ నేరగాళ్లు రూ. 1.40లక్షలుడ్రా చేశారని గుర్తించాడు. దీంతో కానిస్టేబుల్ తన ఖాతాను బ్లాక్ చేపించాడు. గురువారం హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

కరీంనగర్ లీగల్, జూన్7: కుటుంబ పరిచయాన్ని అడ్డుపెట్టుకుని ఏడు సంవత్సరాల బాలికపై పలుమార్లు అత్యాచారానికి ఒడిగట్టిన నేరంలో నిందితుడు కారుపాక రాజ్‌కుమార్(20)కు 20 ఏళ్ల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ మొదటి అదనపు జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి వెంకటేష్ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన వివాహితకు భర్త, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. బతుకుదెరువు కోసం భర్త పిల్లలతో కలిసి వచ్చి హుజూరాబాద్‌లోని గ్యాస్ గోదాం ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. కొన్నాళ్లకు భర్త అనారోగ్యంతో చనిపోగా ఆమె ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నది. వీణవంక మండలం పోతిరెడ్డి పేటకు చెందిన కారుపాక రాజ్‌కుమార్ తల్లితో కలిసి అదే ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. వివాహిత కుటుంబంతో రాజ్‌కుమార్‌కు పరిచయం ఉన్నది. దీన్ని ఆసరా చేసుకున్న రాజ్‌కుమార్ ఆమె పెద్దమ్మాయికి మాయమాటలు చెప్పి 2020 ఆగస్టు 8న మధ్యాహ్నం తన ఇంటికి తీసుకువెళ్ళి ఆమెపై అత్యాచారం చేశాడు. మరుసటి రెండు రోజులు కూడా అత్యాచారం చేసి ఎవరికీ చెప్పొద్దని బెదించాడు. రెండు రోజుల తరువాత బాలికకు తల్లి స్నానం చేయిస్తుండగా అమ్మాయి పరిస్థితి చూసి ఏమి జరిగిందని ఆరా తీయగా విషయం మొత్తం తల్లికి వివరించింది. బాలిక తల్లి హుజూరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటికి సీఐ మాధవి రాజ్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు. మరో సీఐ ఎస్ శ్రీనివాస్‌రావు ఈ కేసు దర్యాప్తు జరిపారు. ఈ కేసులో సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాజిక్యూటర్ జూలూరి రాములు విచారించారు. సాక్షాధారాలు పరిశీలించిన జడ్జి నిందితుడు రాజ్‌కుమార్‌కు జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

అంజన్న ఆలయ హుండీ ఆదాయం రూ.1.09 కోట్లు


హుండీ సొమ్ములు లెక్కిస్తున్న సిబ్బంది

మల్యాల, జూన్ 7: కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో హుండీల ద్వారా రూ.1,09,62,169 నగదు ఆదాయం సమకూరినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. 34 రోజులకు ఆలయంలోని 12 అంజన్న హుండీలను విప్పి శుక్రవారం లెక్కింపు చేయగా నగదుతో పాటు 44గ్రాముల మిశ్రమ బంగారం, 3.800కిలోల మిశ్రమ వెండి, 41విదేశీ కరెన్సీ లభించినట్లు ఈవో తెలిపారు. ఈ లెక్కింపులో వరంగల్ డీసీ సంజీవరెడ్డి, ఏఈవో వై. అంజయ్య, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, చంద్రశేఖర్ ఆలయ అధికారులు, సిబ్బంది, శ్రీ లలిత సేవా ట్రస్ట్ సభ్యులు తదితరులు లెక్కింపులో పాల్గొన్నారు.

జూలైలోగా అభివృద్ధి పనులు పూర్తి

-నగరంలో రూ.147 కోట్లతో మంచినీటి పైపులైను పనులకు టెండర్లు -మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, జూన్ 7: నగర పాలక సంస్థ పరిధిలో ఎన్నికల కోడ్‌తో నిలిచిన పనులను జూలై లోగా పూర్తి చేస్తామని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన మల్టీపర్పస్ పార్కు పనులను మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్లతో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నగర ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా పాలకవర్గం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందుకోసం ఇప్పటికే 147 కోట్ల రూపాయలతో మంచినీటి పైపులైన్ పనులకు టెండర్లు నిర్వహించామన్నారు. కొత్తగా 10ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన నీటి శుద్ధి కేంద్రాన్ని కూడా నిర్మాణం చేస్తున్నాం. త్వరలోనే పనులు ప్రారంభించి మంచినీటిని ప్రజలకు అందిస్తామని పేర్కొన్నారు. లోయర్ మానేరు డ్యామ్‌లో నీటి మట్టం తగ్గినందున రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేస్తున్నామని, వర్షాలతో డ్యామ్‌లోకి 10 టీఎంసీల నీరు వచ్చిన వెంటనే మళ్లీ ప్రతిరోజు మంచి నీటిని అందిస్తామన్నారు. 24/7 మంచినీటి సరఫరాకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన హౌజింగ్‌బోర్డులో పనులు పూర్తయ్యాయని త్వరలోనే నిరంతర నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. మల్టీపర్పస్ పార్కు పనులు దాదాపు తుదిదశకు చేరుకున్నాయన్నారు. ఇంకా మ్యూజికల్ ఫౌంటేన్ పనులు పూర్తిచేసేందుకు నెలపదిహేను రోజులు పడుతుందని తెలిపారు. ఆ పనులు పూర్తయిన వెంటనే రెండు నెలల్లో చక్కటి అందమైన పార్కును ప్రజలకు అందిస్తామని చెప్పారు. కరీంనగర్ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ ప్రాజెక్టుకు సంబంధించిన సివిల్ పనులు పూర్తయ్యాయని, అక్కడక్కడ మిగిలిన పనులు కూడా పూర్తిచేస్తున్నారని చెప్పారు. 133 కోట్ల సీఎం హామీ నిధులతో ప్రారంభించిన అభివృద్ధి పనులు ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయాయన్నారు. ఈ నెలాఖరులుగా అసంపూర్తిగా వదిలిన పనులన్నిటిని పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నగరంలోని ప్రధాన మురుగు, వరదనీటి కాలువల్లోని సిల్ట్ తీసే పనులు జరుగుతున్నాయని తెలిపారు. గత అనుభవాల దృష్ట్యా ఎక్కడా వరద ఇబ్బందులు రాకుండా అన్ని ముందస్తు చర్యలు చేపడుతున్నామని సునీల్ రావు తెలిపారు. వర్షాకాలంలో నగరపాలక సంస్థ విపత్తు నిర్వహణ బృందాలను సిద్ధం చేశామని తెలిపారు. నగరపాలక సంస్థలో ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేసి సమాచారం ఇచ్చిన వెంటనే డీఆర్‌ఎఫ్ సిబ్బంది ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపడతామని చెప్పారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తున్నామని, ఈ విషయంలో ఎక్కడా రాజీ పడటం లేదని అన్నారు. ఎవరైనా నాణ్యత విషయంలో గానీ, బిల్లుల చెల్లింపు విషయంలో దర్యాప్తు సంస్థలకు, ఉన్నతాధి కారులకు ఫిర్యాదు చేసుకోవచ్చని సునీల్‌రావు స్పష్టం చేశారు. అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈమీడియా సమావేశంలో కార్పొరేటర్లు బోనాల శ్రీకాంత్, దిండిగాల మహేశ్, అఖిల్ ఫిరోజ్, కోలమాలతి సంపత్, ఎస్‌ఈ మహేందర్, ఈఈ రొడ్డ యాదగిరి, డీఈ అయాబ్, ఏఈ గఫూర్, స్మార్ట్‌సిటీ అధికారులు సందీప్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు

స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ట భద్రత

-అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్‌టౌన్, జూన్ 7: గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష సామగ్రిని భద్రపరిచిన స్ట్రాంగ్ రూం వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, గ్రూప్-1పరీక్షల నోడల్ ఆఫీసర్ ప్రఫుల్ దేశాయ్ పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి కరీంనగర్ పోలీస్ హెడ్ క్వార్టర్సులోని స్ట్రాంగ్ రూమ్‌కు గ్రూప్-1 పరీక్షకు సంబంధించిన సామగ్రిని తరలించారు. సామగ్రి భద్రపరచే ప్రక్రియను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్, ఆర్డీఓ మహేశ్వర్, అడిషనల్ డీసీపీ జే కుమార్ పరిశీలించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు పరీక్షకు సంబంధించిన ఓఎంఆర్ షీట్లు, ప్రశ్నాపత్రాలు, ఇతర మెటీరియల్ అన్నింటిని సరి చూసుకోవాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. గ్రూప్-1 పరీక్ష ప్రశాంతంగా, సజావుగా సాగేలా అన్ని చర్యలు తీసుకుం టున్నామని వివరించారు. సామగ్రిని ఆదివారం ఉదయం ఆయా పరీక్ష కేంద్రాలకు పోలీస్ ఎస్కార్ట్ మధ్య తరలిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ శ్రీలక్ష్మి, కొండగట్టు జెఎన్టియూ ప్రొఫెసర్ బీ సతీష్ కుమార్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కాళీ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆత్మగౌరవ కవాతు'ను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్

సుభాష్‌నగర్, జూన్7: ఎంఆర్‌పీఎస్ 30సంవత్సరాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్‌లో తలపెట్టిన మాదిగ ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ పిలుపు నిచ్చారు. శుక్రవారం నగరంలోని కృషి భవన్‌లో ఎంఆర్‌పీఎస్ అనుబంధ సంఘాల జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కల కీలక దశలో ఉందన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఉన్న మాదిగా, మాదిగ ఉప కులాల నిరుద్యోగ యువత, విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు అన్ని విభాగాలకు నూతన కమిటీలను నిర్మాణం చేసుకోవాలన్నారు. గ్రామ స్థాయికి వెళ్లి మాదిగలను చైతన్య పరచాలని సూచించారు. ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావాన్ని గ్రామ గ్రామాన నిర్వహించాలన్నారు. దేశం నివ్వెరపోయేలా వరంగల్‌లో నిర్వహించే ఈకవాతుకు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో ఇంజం వెంకటస్వామి, రుద్రాపు రాంచందర్, దండు అంజయ్య, జిల్లెల్ల రమేష్, కనుకుంట్లశ్రీనివాస్, కాథ మల్లయ్య, మోరె అరుణ్‌కుమార్, కోడూరి మహేష్, అంబాల మదునయ్య, కొమ్ము రాజమల్లు, నక్క లక్ష్మణ్, మొదుంపల్లి ప్రభుదాస్, అడెపు శ్రీనివాస్, కమ్మం కుమారస్వామి, చంటి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల సంబరాలు


కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

గణేశ్‌నగర్, జూన్ 7: ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించిన సందర్భంగా కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్ వద్ద తెలుగుదేశం పార్టీ కరీంనగర్ పార్లమెంట్ అధ్యక్షుడు వంచ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కూటమి 164 స్థానాల్లో అఖండ విజయం సాధించి చరిత్రలో నిలిచిపోయిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్లో కూటమి విజయం జగన్ అహంకారానికి, నియంత పాలనకు చెంపపెట్టు అని తెలిపారు. రానున్న రోజుల్లో తెలంగాణలో కూడా తెలుగుదేశం పార్టీ ప్రముఖ పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి దామెర సత్యం, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కళ్యాడపు ఆగయ్య, ఇన్‌చార్జిలు ఎడ్ల వెంకటయ్య,ఆవునూరి దయాకర్ రావు, బత్తుల శ్రీనివాస్, ఎర్రవెల్లి రవీందర్ రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ఎర్రవెల్లి వినీత్, బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సాయిల్ల రాజమల్లయ్య పాల్గొన్నారు.

బస్సు పునః ప్రారంభం


ఆకునూర్ బస్సు ప్రారంభిస్తున్న నాయకులు

సైదాపూర్, జూన్ 7: కట్కూర్-కన్నారం నుంచి సైదాపూర్ మీదుగా కరీంనగర్, గోదావరిఖని బస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఇంతకు ముందు గోదావరిఖని నుంచి కట్కూర్‌కు ప్రతీ రోజు రెండు ట్రిప్పులు నడిచేది. ఈ ప్రాంత ప్రజలకు కరీంనగర్, గోదావరిఖని పోయేందుకు అనుకూలంలగా ఉండేది. కాగా అప్పటి అధికారులు బస్సును నిలిపి వేశారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు, కాంగ్రెస్ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. కట్కూర్ టూ గోదావరిఖని బస్సు ప్రారంభించాలని విన్నవించారు. స్పందించిన మంత్రి కట్కూర్-కన్నారం టూ గోదావరిఖని బస్సు ప్రారంభించి నడపాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు బస్సును ప్రాంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుండారపు శ్రీనివాస్, నాయకులు మిట్టపెల్లి కిష్టయ్య, శ్రీనివాస్, చంద్రయ్య, రవీందర్‌రెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

హుజూరాబాద్, జూన్ 7: హుజూరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ కేసులో శుక్రవారం ఒకరికి జైలు శిక్ష పడిందని టౌన్ సీఐ బొల్లం రమేష్ తెలిపారు. 14మందిని శుక్రవారం కోర్టులో హాజరు పరిచినట్లు జూనియర్ సివిల్ జడ్జీ పద్మ సాయిశ్రీ 14మందికి రూ. 9500 జరిమానా విధించారని తెలిపారు. రాజు అనే వ్యక్తికి ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు. రమేష్ మాట్లాడుతూ వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు.

హరినామ సంకీర్తనలో పాల్గొన్న మహిళలు


హరినామ సంకీర్తనలో పాల్గొన్న మహిళలు

సైదాపూర్, జూన్ 7: తిరుమల తిరుపతి దేవస్థానంలో హిదూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిత్యం జరిగే అఖండ హరినామ సంకీర్తనలో సైదాపూర్ మండలం రాములపల్లి గ్రామానికి చెందిన మణికంఠ భజన మండలి మహిళలు పాల్గొని భజనలు చేశారు. స్వామి వారి సన్నిదిలో భజన చేసేందుకు అవకాశం వచ్చినందుకు తమ అదృష్టంగా బావిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో భజనమండలి సభ్యులు దేవేంద్ర, కవిత, హైమావతి, సహారిక, సత్తమ్మ, గీత, కళావతి, సరోజన, ప్రగతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేత

కరీంనగర్‌టౌన్, జూన్7 : మిషన్ భగీరథ ప్రధాన పంప్‌హౌస్ మహ్మదాపూర్ సబ్‌స్టేషన్ మరమ్మతు పనుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి ఆదివారం సాయంత్రం 4గంటల వరకు రెండు రోజులు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని హుజూరాబాద్ మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.రామ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మానకొం డూర్, హుస్నాబాద్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో నీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన తెలిపారు.

శ్రీవైష్ణవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కరీంనగర్ కల్చరల్, జూన్ 7: తెలంగాణ శ్రీవైష్ణవ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతీ యేటా ఇస్తున్నట్లుగా 2024 మార్చి, ఏప్రిల్ నెలల్లో జరిగిన 10వ, ఇంటర్ తరగతులలో అత్యున్నత మార్కులు సాధించిన శ్రీవైష్ణవ విద్యార్థులకు రజతోత్సవాల సందర్భంగా జూలై నెలలో ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీచర కృష్ణమాచార్యులు, గోవర్ధనగిరి శశికిరణ్ ఆచార్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాడభూషణి శ్రీనివాసాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు పేరు, తండ్రి పేరు, చిరునామా, సాధించిన మార్కుల మెమో జత చేయాలని పేర్కొన్నారు. అలాగే 8వ తరగతి నుంచి పై చదువులు చదివే పేద శ్రీవైష్ణవ విద్యార్థులకు ఆర్థిక పారితోషకం కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయా విద్యార్థులు కూడా తమ పేరుతో పాటు తండ్రి పేరు, వృత్తి, చిరునామా,ఆదాయవివరాలు, బోనాఫైడ్ సర్టిఫికెట్ జత చేసి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తులను జూన్ 30వ తేదీ లోగా స్వయంగా గానీ పోస్ట్ ద్వారాగానీ అధ్యక్షులు, శ్రీవైష్ణవ సేవా సంఘం, తెలంగాణ, శ్రీవైష్ణవ సదనం, రోడ్ నెం.5, చంద్రపురి కాలని, ఎల్‌బి నగర్, హైదరాబాద్-500074 చిరునామాకు సమర్పించాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్

సుభాష్‌నగర్, జూన్ 7: ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, విద్యార్థులు శుక్రవారం జిల్లా కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జనరల్ ఆసుపత్రికి 20 ఏసీలను మంజూరు చేసినందుకు గాను వారంతా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అనుమతి లేని కళాశాలలను మూసివేయాలి


జిల్లా ఇంటర్మీడియేట్ బోర్డు అధికారికి వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

భగత్‌నగర్, జూన్7: జిల్లా వ్యాప్తంగా అనుమతి లేకుండా నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలలను మూసివేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా ఇంటర్మీడియేట్ బోర్డు అధికారి వెంకటేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సంద ర్భంగా భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా ఉపాధ్యక్షుడు ఆసంపెల్లి వినయ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియేట్ కళాశాలల్లో ఫీజుల నియంత్ర చట్టం అమలు చేయాలన్నారు. కళాశాలల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలన్నారు. మండల కేంద్రాల్లోని జూనియర్ కళాశాలల్లో వృత్తి విద్యా కోర్సులను అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పారపు రోహిత్, జిల్లా కమిటీ సభ్యుడు సందేశ్, సద్విత్‌కుమార్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథపై సర్వే సిబ్బంది వివరాలను సేకరించాలి


మాట్లాడుతున్న ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి

కరీంనగర్ రూరల్, జూన్7: మిషన్ భగీరథ పథకంపై పూర్తి స్థాయిలో సర్వే సిబ్బంది వివరాలను సేకరించాలని ఎంపీవో సిహెచ్ జగన్మోహన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం కరీంనగర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ, ఈజీఎస్ సిబ్బందికి సర్వేపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లా డుతూ ఒక్కో సర్వే సిబ్బంది తమకు కేటాయించిన గ్రామంలోని ఇండ్లను క్షేత్ర స్థాయిలో సందర్శించి వివరాలను సేకరించాలన్నారు. రోజుకు 25ఇండ్లను సర్వే చేయాలన్నారు. నిర్ధీత ఫార్మాట్‌లోని వివరా లను సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. టెక్నికల్ సమస్యలు ఎదురైతే సంబంధిత మాస్టర్ ట్రైనర్లను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో సంజీవ రావు, మిషన్ భగీరథ ఏడీఈ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

● ప్రధానోపాధ్యాయుడు కె భూమ్‌రెడ్డి

శంకరపట్నం, జూన్ 7: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు కె భూమ్‌రెడ్డి అన్నారు. శంకరపట్నం మండలంలోని ఎరడపల్లి గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు ఉదయం పూట ఇంటి వద్ద ఉండడం లేదని, నేరుగా ఉపాధిహామీ పనులు చేసే స్థలం వద్దకు వెళ్లి బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కమిటీల ద్వారా పాఠశాలకు అవసరమయ్యే మౌలిక వసతులను ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో 20-30సంవత్సరాల అనుభవం కలిగిన ఉపాధ్యాయులు విద్యను బోధిస్తున్నారని, ఇలాంటి ప్రభుత్వ పాఠశాలలో మీ పిల్లలను చేర్పించినట్లయితే మీకు ఆర్థిక భారం తప్పుతుందన్నారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందుతుందని తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ స్వప్న, వివిధ పాఠశాలల హెచ్ఎంలు వెంకటరామిరెడ్డి, లక్ష్మి, స్వరూప, జ్యోతి, రవి పాల్గొన్నారు.

చొప్పదండి: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బడిబాట కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ చిలుక రవీందర్ మాట్లాడుతూ బడిఈడు వయస్సు పిల్లలని ప్రభుత్వ పాఠశాలకు, అంగన్‌వాడీలకు తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాలరావు, ఎంపీవో రాజగోపాలరెడ్డి, ఎస్‌బిఎం వేణు ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, ఈజీఎస్ ఈసీ రాజు తదితరులు పాల్గొన్నారు



ఎరడపల్లిలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మానకొండూర్: మండలంలోని పచ్చునూర్ గ్రామంలో శుక్రవారం జరిగిన బడిబాట కార్యక్రమానికి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో బాగంగా ఉపాధ్యాయులు గ్రామంలోని ఇంటింటా తిరిగి బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. అనంతరం గ్రామంలో ర్యాలీని నిర్వహించి గ్రామస్థుకు అవగాహన కల్పించారు. బడిబాటలో నమోదు అయిన 11 మంది విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోరెడ్డి దామోదర్‌రెడ్డి, వెంకటలక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

శంకరపట్నం, జూన్ 7: మండలంలోని తాడికల్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఏఈ సంపత్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. సబ్ స్టేషన్ పరిధిలోని కేశవపట్నం, వంకాయగూడెం, కరీంపేట, అంబాలపూర్, ఇప్పలపల్లి, మక్త, చింతగుట్ట, పాపయ్యపల్లి, తాడికల్ గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామంలోని సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మాటూరి వీరచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పలనర్సింగాపూర్, దమ్మక్కపేట, కాట్రపల్లి, కేసీ క్యాంపు, ఇండస్ట్రీయల్ ఏరియాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు

సైదాపూర్: సబ్ స్టేషన్ శనివారం మరమ్మతులు చేపడుతున్నందున ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు సైదాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో, విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఆకునూర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మెడికల్ క్యాంపునకు స్పందన

తిమ్మాపూర్, జూన్ 7: మండలంలోని శ్రీచైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెడికల్ క్యాంపునకు స్పందన లభించింది. ఇండియన్ ఆర్మీ, అగ్నిపథ్, పారామిలటరీ దళాలకు సంబందించిన ఉద్యోగ నియామకాల్లో భాగంగా అభ్యర్థులకు మెడికల్ ఫిట్‌నెస్‌కు సంబందించిన 18 రకాల మెడికల్ టెస్టులను అకాడమీ చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహించారు. సుమారు 298 మంది అభ్యర్థులు హాజరై వారి దేహదారుఢ్య పరీక్షలు చేసుకున్నారు. ఇట్టి ఫిట్‌నెస్ పరీక్షలను శరత్ మాక్స్, వర్షన్ విజన్, కేశవ ఈఎన్‌టి ఆసుపత్రుల డాక్టర్ల సమక్షంలో కళాశాలలో క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి శ్రీ చైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ ప్రిన్సిపాల్ పల్లె శ్యాంసుందర్ రెడ్డి, పీడి లెంకల మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

దేశంలో బీసీ కులగణన చేపట్టాలి


మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్

చిగురుమామిడి, జూన్ 7: కేంద్రం ప్రభుత్వం దేశవ్యాప్తంగా బీసీ కుల గణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జడ్పీటీసీ గీకురు రవీందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది ఎన్నికల్లో మోదీ ప్రభంజనం తగ్గిందన్నారు. దేశంలో అత్యధికంగా ఉన్న ఓబీసీలు దళిత, బహుజనుల సంక్షేమం మీద, వారి ప్రయోజనాలపై దృష్టి పెట్టాలన్నారు. బడుగు, బలహీన వర్గాల శ్రేయస్సు కోసం వెంటనే బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు రామోజు రాజ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్, జిల్లా నాయకులు తాళ్లపల్లి తిరుపతి, గట్టు ప్రశాంత్, పెసరు శ్రీనివాస్, శివాజ నేయులు, లింగం యాదవ్, వెంకటయ్య, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు చేప మందు పంపిణీ

కరీంనగర్ కల్చరల్, జూన్ 7: ధన్వంతరి ఆయుర్వేద కళానికేతన్ ఆధ్వర్యంలో మృగశిర కార్తి సందర్భంగా శని, ఆది వారాల్లో ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు 101 వన మూలికలతో తయారు చేసిన చేప మందును కరీంనగర్ టవర్ క్లాక్ వద్ద అందజేయనున్నట్లు కామారపు నరహరిస్వామి, కామారపు విశ్వనాథం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం 100 రూపాయలు మాత్రమే తీసుకుంటున్నట్లు ఈ మందుతో దగ్గు, దమ్ముతో పాటు 88 వాత రోగములు నశిస్తాయని, మందు సేవనానికి ఎలాంటి పత్యం లేదని పేర్కొన్నారు.

కవి దేవి యాదగిరికి పురస్కారం

కరీంనగర్ కల్చరల్, జూన్ 7: ధర్మారంకు చెందిన కరీంనగర్‌లో నివాసముంటున్న కవి దేవి యాదగిరికి రచయిత్రి వాసా ప్రభావతి స్మారకంగా వాసా ప్రభావతి ట్రస్టు నిర్వహించిన వచన కవితా పోటీల్లో 'మౌన యాగం' కవితకు గాను హైదరాబాద్‌లో గురువారం రాత్రి కవితా పురస్కారం ప్రదానం చేశారు. పురస్కారం కింద 3 వేల రూపాయల చెక్‌ను చారిత్రక నవలా రచయిత ముదిగొండ శివప్రసాద్ చేతుల మీదుగా అందించారు. యాదగిరి మంథని డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ లెక్చరర్‌గా పని చేస్తూ 2012లో పదవీ విరమణ పొందారు. వివిధ సాహితీ ప్రక్రియల్లో రచనలు చేస్తున్న ఆయన కొలిమి, బతుకుబండి కవితా సంపుటులను వెలువరించారు. వివిధ పత్రికల్లో యాదగిరి రచనలు ముద్రితమయ్యాయి. కాగా ఈ పురస్కారం దక్కడం పట్ల రచయితలు కందుకూరి అంజయ్య, సబ్బని లక్ష్మీనారాయణ, సంకేపల్లి నాగేంద్రశర్మ, సీవి కుమార్, దేవి శ్రీహరి తదితరులు అభినందనలు తెలిపారు.

తెరుచుకోనున్న పాఠశాల

గన్నేరువరం, జూన్ 7: మండలంలోని చొక్కారావుపల్లి గ్రామంలో 15 ఏళ్లుగా మూతపడి ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చొరవతో ఈ నెల 12న ప్రారంభం కానున్నదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి తెలిపా రు. గ్రామస్థుల సహకారంతో భవనానికి మరమ్మతులు చేపట్టి ప్రారంభో త్సవానికి సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

ఐదేళ్లకోసారి వేలం నిర్వహించాలి

గన్నేరువరం, జూన్ 7: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మించిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలకు ఐదేళ్లకోసారి వేలం పాట నిర్వహించాలని వ్యాపారులు కోరారు. స్థానికంగా శుక్రవారం పలువురు మాట్లాడుతూ ఏడాదికోసారి వేలం పాట నిర్వహించడం వల్ల తమకు నష్టం వాటిల్లుతుందని చెప్పారు. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యాపారులు సందె వేని ప్రశాంత్, సబ్బని నరేష్, ముడికె బాలరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ.

రామడుగు, జూన్ 7 : మండలంలోని వెలిశాల గ్రామానికి చెందిన తాల్లపల్లి సత్తమ్మ అనే ప్రధానోపాధ్యాయురాలు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో శుక్రవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంటన ఎంపీపీ హరీష్, మండల అధ్యక్షులు తిరుపతి, రమేశ్, శంకర్, నర్సింగరావు, యాదగిరి ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

హుజూరాబాద్‌రూరల్, జూన్ 7: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లి గ్రామానికి చెందిన మొగ్గుంపురం అనిల్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం సామాజికవేత్త, హెచ్‌సీఎల్ డైరెక్టర్ సబ్బని వెంకట్ బాధి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగాక్వింటాల్ బియ్యాన్ని అందజేశారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

ఇల్లందకుంట, జూన్ 7: మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన గన్ను శ్యామ్‌సుందర్ ఇటీవల ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ సందర్భంగా జమ్మికుంటలోని ది గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో ప్రమాద బీమా లక్ష రూపాయల చెక్కుని శ్యాంసుందర్ భార్య గన్ను అరుణకి వ్యవసాయాధికారి రజిత సమక్షంలో శుక్రవారం మేనేజర్ మహేందర్ అందజేశారు.

వీణవంక: ఇప్పలపల్లి గ్రామనికి చెందిన ముదిగంటి రాజిరెడ్డి ప్రమాదవశాత్తు మృతి చెందగా బాధిత కుటుంబానికి యూనియన్ బ్యాంక్ డీజీఎం అపర్ణరెడ్డి ఐదు లక్షల రూపాయల చెక్కును చల్లూరు యూనియన్ బ్యాంక్‌లో అందజేశారు. యూనియన్ బ్యాంక్‌లో పంట రుణం తీసుకున్నా సమయంలో ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించడంతో ప్రమాద బీమా క్రింద ఐదు లక్షల రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. ప్రతి రైతు ప్రమాద బీమా చేయించుకోవాలని డీజీఎం సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ దేవేందర్‌రెడ్డి, ఇన్సూరెన్సు మేనేజర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

గోరక్ష మహాధర్నాకు తరలివెళ్లిన నాయకులు

హుజూరాబాద్‌రూరల్, జూన్ 7: గోవుల రక్షణ కోసం ప్రభుత్వం వెంటనే గోరక్షక చట్టాన్ని తీసుకరావాలని కోరుతూ జిల్లా కేంద్రంలో వీహెచ్‌పీ నాయకులు చేపట్టిన గోరక్ష మహాధర్నాకు స్థానికులు తరలివెళ్లారు. మండలంలోని కనుకులగిద్దె గ్రామానికి చెందిన వీహెచ్‌పీ మండలాధ్యక్షుడు కంకణాల రమేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో వీహెచ్‌పీ నాయకులు ధర్నాకు తరలి వెళ్లారు.

ఉర్దూ మీడియం పాఠశాలలో చేర్పించాలి

హుజూరాబాద్, జూన్ 7: ముస్లింలు తల్లిదండ్రులు పిల్లను ఉర్దూ మీడియం పాఠశాలలో చేర్పిం చాలని తెలంగాణ ముస్లిం ఎంప్లాయిస్ అసోసియేషన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ అన్నారు. హుజూరాబాద్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉర్దూ మీడియం పాఠశాలలో పిల్లలను చదివించడానికి ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ చాలా మంది తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో చేర్పించి ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఉర్దూ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందిస్తున్నారన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

కోల్‌సిటీటౌన్, జూన్ 7: భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గోదావరిఖనిలోని నిరుపేద విద్యార్థులకు శుక్రవారం నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ట్రస్మా నాయకులు రాంచంద్రారెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు జక్కం శ్రీనివాస్ చేతుల మీదుగా ఐదుగురు విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో భరోసా సంస్థ అధ్యక్షురాలు నసీమాబేగం పాల్గొన్నారు.

మెరుగైన సమాజ నిర్మాణం కోసం మేధోమథనం

పెద్దపల్లిటౌన్, జూన్ 7: మెరుగైన సమాజం కోసం మేధో మధనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు లింగమల్ల శంకర్ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహనీయుల ఆశయ సాధనలో భాగంగా ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ రిజిస్ట్రేషన్ నెంబర్ 542 ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మేధావులతో మేధోమథన కార్యక్రమాన్ని గాయత్రి జూనియర్ కళాశాల పెద్దపల్లిలో చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకట స్వామి, క్యాదాసి రాజేశం, వెంకటేశం, రాజన్న పాల్గొన్నారు.